ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
శనివారం 11 మే 2024



శ్రీవారి ఆలయంలో అక్షయ తృతీయ

● జోరుగా డాలర్ల విక్రయాలు



టీటీడీ సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ చేతుల మీదుగా గోల్డ్ డాలర్లు అందుకుంటున్న సభ్యుడు కె.అనీల్‌కుమార్‌రెడ్డి దంపతులు



అన్నదానం చేస్తున్న సినీనటి నమిత

ప్యారీస్, మే 10: స్థానిక టి.నగర్‌లోని శ్రీవారి ఆలయంలో అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8.50 గంటలకు బంగారు, వెండి డాలర్లను వేంకటేశ్వర స్వామి పాదాల చెంత ఉంచి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం టీటీడీ చెన్నై సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ బంగారు, వెండి డాలర్ల విక్రయాలు ప్రారంభించారు. డిప్యూటీ ఈవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ సుమతి పర్యవేక్షణలో 10, 5, 2 గ్రాముల బంగారు డాలర్లు, 5, 2 గ్రాముల వెండి డాలర్ల అమ్మకాలు జోరుగా సాగాయి. పాలక మండలి సభ్యులు కె.అనిల్‌కుమార్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో ఉంచిన స్వామివారి డాలర్లను మొదట కొనుగోలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు వీవీఆర్ కృష్ణారావు, బి.మోహనరావు, కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సినీనటి నమిత తన జన్మదినం సందర్భంగా శ్రీవారి ఆలయానికి కుటుంబ సభ్యుల సమేతంగా వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని ఆలయంలో సాయంత్రం 5.45 గంటలకు తిరువిలక్కు పూజ, కుంకుమార్చన నిర్వహించారు. పద్మావతి సమేత శ్రీవారిని వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణం, ప్రవేశద్వారాన్ని మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అక్షయతృతీయ సందర్భంగా శ్రీవారి దర్శనం కోసం పోటెత్తిన భక్తులను క్యూలైన్ల ద్వారా అనుమతించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, అక్షయతృతీయ రోజున 100 బంగారు డాలర్లు, 200లకు పైగా వెండి డాలర్లు భక్తులు కొనుగోలు చేసినట్లు డిప్యూటీ ఈవో విజయ్‌కుమార్ తెలిపారు.

126వ పుష్ప ప్రదర్శన నమూనా



పుడమిపై అందాలు
విరుల సోయగాలు



పూలతో చేసిన కొండ రైలు



పిల్లలను ఆకట్టుకుంటున్న మంకీ

ప్రకృతి అందాలకు నెలవైన ఊటీలో 126వ పుష్ప ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పూలు ప్రకృతికాంతకు శోభనిచ్చాయి. ఆబాల గోపాలాన్ని మైమరిపించే పలురకాల పూలతో ఉద్యానవనం కనులపండువగా దర్శనమిస్తోంది. పది రోజుల పాటు సుగంధాలు వెదజల్లుతూ ఈ పుష్ప ప్రదర్శన పర్యాటకులకు ఆహ్లాదం కలిగించనుంది.

- ప్యారీస్

టెన్త్‌లో 91.55% ఉత్తీర్ణత

● బాలికలదే పైచేయి
● అరియలూరు జిల్లాదే అగ్రస్థానం

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 91.55 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఎప్పటిలాగే ఈ పరీక్షల్లోనూ బాలికలదే పైచేయి అయింది. ఈ పరీక్షల్లో బాలురు 88.58 శాతం, బాలికలు 94.54 శాతం ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 26న ప్రారంభమై ఏప్రిల్ 8న ముగిశాయి. ఈ పరీక్షలకు మొత్తం 8,94,264 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాటి ఫలితాలను శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పరీక్షల విభాగం సంచాలకులు సేతురామ వర్మ విడుదల చేశారు. ఈ ఫలితాలు విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు ఎస్ఎంఎస్ పంపించారు. ఇదే విధంగా ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో 91.,55శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గత యేడాదితో పోల్చుకుంటే ఈ యేడాది ఉత్తీర్ణతా శాతం 0.16 పెరిగింది. ఈ పరీక్షలకు 4,47,203 మంది బాలురు హాజరుకాగా 3,96 ,152 మంది (88.58శాతం మంది) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా 4,47,061 మంది బాలికలు ఈ పరీక్షకు హాజరుకాగా, 4,22,591 మంది (94.54 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 12,625 పాఠశాలల్లో జరిగాయి. వీటిలో 4105 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1364 పాఠశాలలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 87.97 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 91.77 శాతం మంది, ప్రైవేట్, స్వయం ప్రతిపత్తి పాఠశాలల్లో 97.43 శాతం మంది, బాలబాలికల పాఠశాలల్లో 91.63 శాతం మంది, బాలికల పాఠశాలల్లో 93.80 శాతం మంది, బాలుర పాఠశాలల్లో 83.17 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

పాఠ్యాంశాలవారీగా...

తమిళ పాఠ్యాంశంలో 8 మంది నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. అధికపక్షంగా గణితశాస్త్రంలో 20,891 మంది వంద శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. సైన్స్‌లో 5104 మంది, సాంఘిక శాస్త్రంలో 4428 మంది, ఆంగ్లంలో 415 మంది నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. తమిళ పాఠ్యాంశంలో 96.85 శాతం, ఆంగ్లంలో 99.15 శాతం, గణితశాస్త్రంలో 96.78 శాతం, సైన్స్ లో 96.72 శాతం, సాంఘిక శాస్త్రంలో 95.74 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

13 నుంచి తాత్కాలిక మార్కుల జాబితా...

పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సకాలంలో ప్లస్-1, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు వీలుగా ఈ నెల 13 నుంచి తాత్కాలిక మార్కుల జాబితా పంపిణీ చేయనున్నట్లు పరీక్షల విభాగం సంచాలకులు సేతురామ వర్మ తెలిపారు. టెన్త్ ఫలితాలు విడుదల చేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదో తరగతి మార్కుల జాబితాను ముద్రించి పంపిణీ చేయడానికి కొంతకాలం పడుతుందని చెప్పారు. విద్యార్థులు ప్లస్-1 ఐటీఐ తదితర కోర్సులలో చేరడానికిగాను తాత్కాలిక మార్కుల జాబితాలను హెడ్మాస్టర్ సంతకంతో పాఠశాల ముద్రతో పంపిణీ చేస్తామని తెలిపారు. విద్యార్థులంతా సోమవారం నుంచి తాత్కాలిక మార్కుల జాబితా పొందవచ్చన్నారు. విలేఖరుల సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్లు నరేష్, సెల్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తీర్ణత సాధించిన ఆనందంలో బాలబాలికలు

దివ్యాంగుల్లో 92.42 శాతం ఉత్తీర్ణత...

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన దివ్యాంగ విద్యార్థులలో 92.42 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు 13,510 మంది హాజరుకాగా వారిలో 12,491 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే విధంగా రాష్ట్రంలో వివిధ జైళ్లలో ఉన్న 260 మంది ఖైదీలు ఈ పరీక్ష రాయగా, వారిలో 228 మంది ఉత్తీర్ణులయ్యారు.

జూలై 2న ఇన్‌స్టెంట్ పరీక్షలు..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు, అనివార్య కారణాల వల్ల ఆ పరీక్షకు హాజరుకాని అభ్యర్థులకు జూలై 2న ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఇన్‌స్టెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలోనే ప్లస్-1, ఐటీఐ. పాలిటెక్నిక్ కోర్సులలో చేరవచ్చని తెలిపారు. ఈ ఇన్‌స్టంట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన టైమ్‌టేబుల్ శనివారం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

అరియలూరు జిల్లా ఫస్ట్...

పదో తరగతి పరీక్షలలో ఇప్పటివరకూ అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధిస్తూ రికార్డు నెలకొల్పుతున్న విరుదునగర్ జిల్లా ఈ యేడాది వెనుకబడింది. ప్రస్తుతం అరియలూరు జిల్లా అన్నిటికంటే అత్యధిక ఉత్తీర్ణత (97.31%) సాధించి అగ్రస్థానంలో నిలిచింది. శివగంగ, రామనాథపురం జిల్లాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

కార్పొరేషన్ స్కూళ్లలో 79.11% ఉత్తీర్ణత...

పదో తరగతి పరీక్షలలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న పాఠశాలల్లో 79.11 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్ ప్రకటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో 206 ప్రాథమిక పాఠశాలలు, 130 మాధ్యమిక పాఠశాలలు, 46 ఉన్నత పాఠశాలలు, 35 మహోన్నత పాఠశాలల మొత్తం 417 పాఠశాలలు నడుపుతున్నారు. ఈ పరీక్షలకు కార్పొరేషన్ పాఠశాలల్లో చదువుతున్న 7311 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 5784 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ స్థానంలో మండవాడిపుదూరు బాలిక



రాష్ట్రస్థాయిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైన కావ్య శ్రియకు స్వీట్ తినిపిస్తున్న పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు



కముది బాలిక కావ్య జనని

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో దిండుగల్ జిల్లా మండవాడిపుదూరు గ్రామానికి చెందిన కావ్య శ్రియ 500 మార్కులకుగాను 499 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ బాలిక తమిళంలో 99 మార్కులు, ఆంగ్లం, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రంలో వందమార్కులతో ఉత్తీర్ణురాలైంది. ఒట్టన్‌సత్తిరం అక్షయ అకాడమీ పాఠశాలలో చదువుతున్న ఈ బాలిక తండ్రి కరుప్పుసామి రైతు కాగా, తల్లి రంజితం గృహిణి. ఈ సందర్భంగా కావ్యశ్రియ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కలెక్టర్ కావాలన్నదే తన ఆశయమని పేర్కొంది. ఇదే విధంగా రామనాథపురం జిల్లా కముది ప్రాంతానికి చెందిన విద్యార్థిని కావ్య జనని కూడా 500 మార్కులకుగాను 499 మార్కులుతో రాష్ట్రస్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ బాలిక కముది రెహ్మానియా మెట్రిక్యులేషన్ స్కూలులో చదివింది. ఈ సందర్భంగా ఆ బాలికను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు...

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన బాలబాలికలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ యేడాది పదోతరగతిలో అత్యధిక శాతం మంది ఉత్తీర్ణులు కావటం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, విద్యార్థులు తమ భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని తమకు నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకుని ప్లస్-1లో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా తమిళగ వెట్రి కళగం నాయకుడు, సినీనటుడు విజయ్ కూడా టెన్త్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో అత్యధిక మార్కులు సాధించిన వారితో భేటీ అవుతానని కూడా ప్రకటించాడు. గత యేడాది విజయ్ ఏర్పాటుచేసిన సభలో రాష్ట్రమంతటా అత్యధిక మార్కులు సంపాదించుకున్న విద్యార్థులకు నగదు బహుమతులు, కానుకలు పంపిణీ చేశారు.

జిల్లాలవారీగా ఉత్తీర్ణతా శాతం

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో అరియలూరు జిల్లా అగ్రస్థానంలో నిలవగా, వేలూరు జిల్లా వెనుకంజలో పడిపోయింది. జిల్లాల వారీగా ఆ వివరాలిలా వున్నాయి...

జిల్లాల వారీగా ఉత్తీర్ణతా శాతం:

అరియలూరు: 97.31 **శివగంగ :** 97.02 **రామనాథపురం:** 96.36 **కన్నియాకుమారి:** 96.34 **తిరుచ్చి:** 95.23 **విరుదునగర్:** 95.14 **ఈరోడ్:** 95.08 **పెరంబలూరు:** 94.77 **తూత్తుకుడి:** 94.39 **విల్లుపురం:** 94.11 **మదురై:** 94.07 **కోయంబత్తూరు:** 94.01 **కరూరు :** 93.59 **నామక్కల్ :** 93.51 **తంజావూరు:** 93.40 **తిరునల్వేలి:** 93.04 **తెన్‌కాశి:** 92.69 **తేని:** 92.63 **కడలూరు:** 92.63 **తిరువారూరు :** 92.49 **తిరుప్పూరు:** 92.38 **దిండుగల్ :** 92.32 **పుదుకోట:** 91.84 **సేలం :** 91.75 **కృష్ణగిరి :** 91.43 **నీలగిరి:** 90.61 **మైలాడుదురై:** 90.48 **ధర్మపురి :** 90.49 **నాగపట్టినం:** 89.70 **చెన్నై:** 88.21 **తిరుపత్తూరు :** 88.20 **కాంచీపురం:** 87.55 **చెంగల్పట్టు :** 87.38 **కళ్లకురిచ్చి:** 86.83 **తిరువళ్లూరు:** 86.52 **తిరువణ్ణామలై :** 86.10 **రాణిపేట:** 85.48 **వేలూరు:** 82.07 **కారైక్కాల్:** 78.20 **పుదుచ్చేరి:** 91.28

శివకాశి పేలుడు ఘటనలో పదికి చేరిన మృతుల సంఖ్య

● ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
● కర్మాగారంలో అడుగడుగునా నిర్లక్ష్యం
● తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి : కార్మిక సంక్షేమ శాఖ



శివకాశి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్

పెరంబూర్, మే 10: విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని బాణాసంచా కర్మాగారంలో చట్టవిరుద్ధంగా, నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సెంగమలపట్టి బాణసంచా కర్మాగారంలో జరిగిన భారీ పేలుడులో కర్మాగారంలోని ఏడు గదులు కుప్పకూలాయి. ఈ ప్రమాదంలో మృతులను చెన్నైకి చెందిన రమేష్, సిలోన్ కాలనీకి చెందిన ముత్తు, మురుగన్ కాలనీకి చెందిన భాగ్యం (55), పారైపట్టికి చెందిన అవుడయమ్మాళ్ (80), శివకాశి నెహ్రూజీ నగర్‌కు చెందిన మారియమ్మాళ్ (50), మేల్ చిన్నయాపురానికి చెందిన విజయకుమార్ (28), చొక్కలింగపురానికి చెందిన కాళీశ్వరన్, శివకాశి సిలోన్ కాలనీకి చెందిన లక్ష్మి (40) సహా ఎనిమిదిమంది మృతి చెందిన విషయం తెలిసిందే. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, శిథిలాల కింద చిక్కుకున్న మరో కార్మికుడి కూడా కన్నుమూయడంతో మృతుల సంఖ్య పదికి పెరిగింది. అంతేగాక ఈ ఘటనలో సుబ్బులక్ష్మి, మల్లిక, తిరుపతి, మారియమ్మాళ్, నాగజ్యోతి, కన్నన్, అళగురాజా, సెల్విఇందిర, జయరాజ్, రొక్కమ్మాళ్, పాపాత్తి, హంసవల్లి, వీరలక్ష్మి తదితర 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 11 మంది శివకాశి ప్రభుత్వాస్పత్రిలో, మరో ముగ్గురు విరుదునగర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో కర్మాగారం యజమాని శరవణన్, లీజుదారుడు ముత్తుకృష్ణన్, ఫోర్‌మెన్ సురేష్‌కుమార్ తదితరులపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి వారిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

మంత్రి పరామర్శ...: బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడి శివకాశి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ శుక్రవారం పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న రామచంద్రన్, బాధితులను కుటుంబసభ్యులను ఓదార్చారు.

నిబంధనల అతిక్రమణ... : ప్రమాదానికి కారణమైన కర్మాగారంలో అడుగడుగునా నిబంధనలు అతిక్రమించినట్లు పోలీసులు తేల్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన భవనంలో బాణాసంచా తయారీ చేయకుండా బయట ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అలాగే, ప్రభుత్వం ఇచ్చిన అనుమతి కన్నా ఎక్కువ మంది కార్మికులు ఉండడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణమని కనిపిస్తోంది. కర్మాగారంలో తగిన భద్రతా ఉపకరణాలు లేవు. యజమాని శరవణన్ ఈ కర్మాగారాన్ని ముత్తుకృష్ణన్, ఫోర్‌మెన్ సురేష్‌లకు లీజుకు ఇచ్చారు. తగిన భద్రతా ఉపకరణాలు లేకుండా అమ్మోనియం వినియోగించి అధిక సంఖ్యలో బాణాసంచాకు ఉపక్రమించడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

కర్మాగారాలను తనిఖీ చేయండి... : రాష్ట్రంలోని బాణసంచా కర్మాగారాలు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లాల కలెక్టర్‌లకు కార్మిక సంక్షేమ శాఖ ఆదేశించింది. బాణసంచా కర్మాగారాలకు లైసెన్స్ పొందిన వారి వివరాలు, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య, కర్మాగారాల్లో భద్రతా అంశాలు తదితరాలు పరిశీలించిన 10 రోజుల్లో నివేదిక దాఖలుచేయాలని కార్మిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు అందజేత...: ఈ ఘటనలో మృతిచెందిన 10 మంది కుటుంబాలకు కర్మాగారం యాజమాన్యం తలా రూ.5 లక్షలు చొప్పున అందజేసింది. అలాగే, చికిత్స పొందుతున్న వారికి తలా రూ.50,000 చొప్పున అందజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చెక్, చికిత్స పొందుతున్న వారికి నగదు రూపంలో అందజేశారు.

మోదీకి వ్యతిరేకంగా ఆందోళనకు యత్నం

● సీటు కేటాయించపోవడంతో తంజావూరులో రైలు నిలిపేసి రైతుల ఆందోళన



పెరంబూర్, మే 10: ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు రైలు లో వారణాశి బయల్దేరిన రైతులకు బోగీలో బెర్త్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ తంజావూరు రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి ఆందోళన చేపట్టారు. మోదీ నేతృత్వంలోని పదేళ్ల ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపిస్తూ అన్నదాతలు పలురకాల ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో, ప్రధాని మోదీ పోటీచేస్తున్న వారణాశి నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా 111 మంది రైతులు పోటీచేయాలని నిర్ణయించారు. అందుకోసం వారణాశి వెళ్లేందుకు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారు. దక్షిణ భారత నదుల అనుసంధానం రైతుల సంఘ అధ్యక్షుడు అయ్యాకన్ను నేతృత్వంలో 39 మంది రైతులు తిరుచ్చి నుంచి కాశి తమిళ సంగమం రైలులో శుక్రవారం బయల్దేరారు. కానీ వెయిటింగ్ లిస్టులో వున్నందున బోగీలో సీట్లు కేటాయించలేమని అధికారులు తెలిపారు. దీంతో, ఆగ్రహం చెందిన రైతులు తంజావూరు రైల్వేస్టేషన్ వస్తున్న సమయంలో చైన్ లాగి రైలు నిలిపివేసి కిందకు దిగి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మీడియాతో మాట్లాడుతూ.. తమకు రిజర్వేషన్ ఖరారైనా, అధికారులు ఉద్దేశపూర్వకంగా తమకు బెర్తులు కేటాయించలేదని ఆరోపించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న రైల్వే ఉన్నతాధికారులు.. విల్లుపురం, చెంగల్పట్టులో ఖాళీ అయ్యే సీట్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సమాచార దర్శిని

6కు సెమిస్టర్ పరీక్షలు వాయిదా

పెరంబూర్, మే 10: అన్నా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ సెమిస్టర్ పరీక్షలు జూన్ 6వ తేదీకి వాయిదాపడ్డాయి. ఈ నెల 15న జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలు లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదాపడ్డాయి. అన్నా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ఈవీఎంలు భద్రపరచిన నేపథ్యంలో, సెమిస్టర్ పరీక్షలు వాయిదావేసినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

బెంగళూరులో భారీవర్షం

● చెన్నైకి మళ్లిన విమానాలు

పెరంబూర్, మే 10: బెంగళూరులో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీని కారణంగా బెంగళూరు విమానాశ్రయంలో విమానాల ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించలేదు. దీంతో, ఆ విమానాశ్రయంలో దిగాల్సిన సింగపూర్,కోవై, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, రాంచీ, లక్నో సహా 10 విమానాలను చెన్నైకి మళ్లించారు. ఈ విమానాల ప్రయాణికులకు నగరంలో ఆహారం, తాగునీటిని ఏర్పాటుచేవారు. శుక్రవారం ఉదయం బెంగళూరులో వాతావరణం అనుకూలించడంతో 10 విమానాలు ఒకటి తర్వాత ఒకటి బెంగుళూరుకు బయల్దేరి వెళ్లాయి.

అరక్కోణం మార్గంలో రైళ్ల వేళల్లో మార్పులు

ఐసిఎఫ్, మే 10: రైలు మార్గం అభివృద్ధి పనుల కారణంగా చెన్నై సెంట్రల్-అరక్కోణం మార్గంలో సబర్బన్ రైళ్ల వేళల్లో మార్పులు జరిగాయి. చెన్నై సెంట్రల్-అరక్కోణం మధ్య శనివారం రాత్రి 7.30, 7.45, 8.20, 9.05, 10, 10.45 గంటల రైళ్లు తిరువళ్లూర్-అరక్కోణం మధ్య ఎక్స్‌ప్రెస్ మార్గంలో నడువనున్నాయి. ఈ కారణంగా ఈ రైళ్లు సెంజిపానంబాక్కం రైల్వేస్టేషన్‌లో ఆగవు. చెన్నై సెంట్రల్-తిరుత్తణి మధ్య శనివారం రాత్రి 8.10 గంటలకు బయల్దేరే రైలుకు సెంజిపానంబాక్కంలో హాల్ట్ లేదు. తిరుత్తణి-చెన్నై సెంట్రల్ మధ్య ఇదే రోజు రాత్రి 8.45, 9.45 గంటల రైళ్లు అరక్కోణం-తిరువళ్లూర్ మధ్య ఎక్స్‌ప్రెస్ మార్గంలో నడువనున్నాయి. సెంజిపానంబాక్కం స్టాప్ మినహా అన్ని స్టేషన్‌లో ఆగి వెళ్లనున్నాయి. అరక్కోణం-చెన్నై సెంట్రల్ మధ్య రాత్రి 9.45 గంటలకు బయల్దేరే రైలు సెంజిపానంబాక్కంలో ఆగదు. చెన్నై సెంట్రల్-తిరుత్తణి మధ్య 12వ తేది వేకువజామున 3.50 గంటలకు బయల్దేరే రైలు సెంజిపానంబాక్కంలో ఆగకుండా వెళుతుంది. అరక్కోణం-చెన్నై సెంట్రల్ మధ్య 12వ తేది వేకువజామున 3.45, 4, 4.25, 5.25 గంటలకు నడిచే సబర్బన్ రైళ్లు కూడా సెంజిపానంబాక్కంలో ఆగవు.తిరుత్తణి-చెన్నై సెంట్రల్ మధ్య 12వ తేది వేకువజామున 4.30గంటలకు నడిచే రైళ్లు కూడా సెంజిపానంబాక్కంలో ఆగవని చెన్నై రైల్వే డివిజన్ తెలిపింది.

ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లు

● నాలుగు రోజుల్లో 69,953 దరఖాస్తులు

పెరంబూర్, మే 10: ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నాలుగు రోజుల్లో 69,953 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్లస్ టూ ఫలితాలు ఈ నెల 6వ తేది విడుదలైన నేపథ్యంలో, ఆ రోజు నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. ఆ ప్రకారం, తొలిరోజు 20,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. గురువారం వరకు 69,953 మంది దరఖాస్తు చేశారు. వారిలో 32,834 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 12,584 మంది సర్టిఫికెట్లు కూడా అప్‌లోడ్ చేశారు. జూన్ 6 దరఖాస్తుల స్వీకరణ తుది గడువుగా ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

కాట్పాడి పాఠశాలలో 82 శాతం ఉత్తీర్ణత

వేలూరు, మే 10: స్థానిక కాట్పాడి ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 242 మంది విద్యార్థినులు పాల్గొనగా 200 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థినులు శుక్రవారం పాఠశాలకురాగా,ప్రధానోపాధ్యాయురాలు సరళ, ఉప ప్రధానోపాధ్యాయులు తిరుమొళి, ఉపాధ్యాయులు జనార్థనన్, కలైసెల్వన్, గణేశన్, బాలచందర్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు థామస్ వారిని అభినందించారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించే వారిపై చర్యలు చేపట్టండి

ఐసిఎఫ్, మే 10: ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా వేసవి సెలవుల్లో పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే వారిపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొన్ని జిల్లాల్లో 100 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి సెలవుల్లో కొన్ని పాఠశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని ఇలాంటి తరగతులు నిర్వహించే పాఠశాలల యజమాన్యాలపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌లకు ఉత్తర్వులు జారీచేశారు.

అక్షయ తృతీయ నాడే నగల దుకాణానికి కన్నం !

● 10 సవర్ల నగలు, 20 కేజీల వెండి నగల దోపిడీ

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): తాంబరం క్యాంప్‌రోడ్డులోని నగల దుకాణానికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేసి పది సవర్ల బంగారు నగలు, 20 కేజీల వెండి దోచుకెళ్ళారు. అక్షయ తృతీయ ప్రారంభ సమయమైన శుక్రవారం వేకువజామును ఈ దొంగలు దోపిడీకి అనువైన సమయంగా ఎంచుకున్నారు. ఆ దుకాణం యజమాని మనోజ్ ఉదయం ఎనిమిది గంటలకు దుకాణాన్ని తెరచి చూసినప్పుడు లోపల నేలపై నగలు, వెండి వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటం చూశారు. ఆ తర్వాత ఆ దుకాణం పక్క గోడలో ఓ మనిషి దూరబడేంత కన్నం వేసి ఉండటం చూసి దిగ్భ్రాంతిచెందాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సేలయూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలలో నమోదైన వీడియో దృశ్యాల ఆధారంగా దోపిడీ దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

జయకుమార్ హత్య కేసు.. ఆధారాల కోసం పోలీసుల అన్వేషణ

అడయార్, మే 10: తిరునెల్వేలి జిల్లాలో కాంగ్రెస్ నేత కేపీకే జయకుమార్ హత్య జరిగి వారం రోజులు గడిచిపోయినా ప్రత్యేక పోలీస్ బృందాలు ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా సేకరించలేకపోయాయి. జయకుమార్ ఇంటి పరిసర ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో క్షుణ్ణంగా గాలించినా ఎలాంటి ఆధారం లభించలేదు. అయితే, జయకుమార్ ఇంటికి సమీపంలో ఒక పెట్ బాటిల్ చిక్కింది. ఇందులో పెట్రోల్ తెచ్చి జయకుమార్ శరీరంపై పోసి నిప్పంటించివుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ నెల 2వ తేదీ జయకుమార్ ధన్‌సింగ్ (60) కనిపించకుండా పోగా, 4వ తేదీన ఆయన శవాన్ని సగం కాలిన స్థితిలో ఆయన తోటలోనే గుర్తించారు. ఆయన కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఈ హత్య కేసు దర్యాప్తు కోసం నెల్లై జిల్లా ఎస్పీ 10ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు ఇప్పటివరకు ఆరుగురు అనుమానితులను విచారించినప్పటికీ చిన్న ఆధారం కూడా సేకరించలేకపోయారు. దీంతో ఈ హత్యను నిందితులు పక్కా ప్లాన్‌తో చేసినట్టుగా పోలీసులు భావిస్తున్నారు.

‘నీట్’ రద్దు చేయాల్సిందే...!

● డీఎంకే ఎంపీ విల్సన్

పెరంబూర్, మే 10: విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ‘నీట్’ రద్దు చేయాలనే తమ డిమాండ్‌లో ఎలాంటి పక్షపాతం లేదని డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ‘ఎక్స్’లో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... ఈ ఏడాది వైద్య కోర్సుల ప్రవేశానికి ఈ నెల 5వ తేది 571 నగరాల్లోని 4,751 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్షకు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్ష ముందు రోజు నీట్ ప్రశ్నాపత్రం లీకైన వ్యవహారంలో బీహార్‌లో 13 మందిని అరెస్ట్ చేశారని, అందువల్ల నీట్ పరీక్షపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో అరెస్టయిన వారిపై ఎలాంటి చర్యలు చేపడతారో తెలియడం లేదన్నారు. నీట్‌లో అసమానత, సామాజిక వివక్ష కారణంగా 26 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పేద విద్యార్థులు డాక్టరు కావాలన్న కలను సాకారం చేసేలా నీట్ రద్దుపై రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందన్నారు. అందులో భాగంగా 2021 సెప్టెంబరులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టిన నీట్ రద్దు తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి, తీర్మానం ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపగా, ఆ తీర్మానం నేటికి రాష్ట్రపతి వద్దకు పంపించలేదని ఆరోపించారు. రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి నీట్‌కు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నీట్‌కు వ్యతిరేకంగా 85 లక్షల మంది సంతకాలు చేశారన్నారు. విద్యార్థుల కలలు సాకారం చేసేలా, వారి భవిష్యత్తు భద్రత కోసం నీట్ పరీక్ష రద్దు చేయాలని ఎంపీ విల్సన్ డిమాండ్ చేశారు.

23 రకాల విదేశీ శునకాలపై నిషేధం వెనక్కి

ప్యారీస్, మే 10: రాష్ట్రంలో 23 రకాల విదేశీ శునకాలకు విధించిన నిషేధాన్ని తమిళనాడు పశుసంవర్థక శాఖ వెనక్కి తీసుకుంది.. ఈ మేరకు ఆ శాఖ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 5వ తేది నగరంలో ఓ బాలికను రోట్‌వీలర్ రకానికి చెందిన పెంపుడు శునకాలు దాడిచేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మార్చి 12వ తేది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా, ఫారిన్ మిక్స్‌డ్, నాన్ మిక్స్‌డ్ డాగ్ రకాలైన పిట్‌బుల్ టెర్రీర్, అమెరికన్ స్టబుల్, రోట్‌వీలర్స్ సహా 23 రకాల శునకాలు అత్యంత దూకుడు, ప్రమాదకరమైన జాబితాలో చేర్చబడ్డాయి. ఈ రకాల శునకాల విక్రయం, పెంచడంపై నిషేధం విధించారు. ఈ రకమైన శునకాల యజమానులు వెంటనే వెటర్నరీ వైద్యులను సంప్రదించి వాటికి సంతానోత్పత్తి లేకుండా స్టెరిలైజ్ చేయాలి. ఈ నేపథ్యంలో, డేగా అర్జెంటైనా, అమెరికన్ బుల్ డాగ్, బేయర్ హోయల్, కన్‌గళ్, సెంట్రల్ ఏసియన్, షెపర్డ్ డాగ్, కాకేషియన్ షెపర్డ్ డాగ్, సౌత్ రష్యన్ సహా 23 రకాలకు నిషేధించిన ఉత్తర్వులు వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. కాగా ఇలాంటి రకాల శునకాలు బయటకు తీసుకెళ్లే సమయంలో దాని మెడకు ఇనుప గొలుసు, మూతికి కవచం తప్పక వేయాలని పశుసంవర్థక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మెదడు నిర్జీవమైన వరుడి అవయవాలు దానం

ప్యారీస్, మే 10: మదురై జిల్లా రాజపాళయంలో మెదడు నిర్జీవమైన వరుడి అవయవాలను ఆయన తల్లిదండ్రులు ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. వివరాలిలా.. రాజపాళయం చిన్నసౌరకాయపట్టి వీధికి చెందిన గణేశన్ కుమారుడు వైరముత్తు (32) బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసి క్యాటరింగ్ చేస్తున్నాడు. ఐదు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన ముత్తులక్ష్మిని వైరముత్తు వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో, ఇటీవల ఇంట్లో స్నానాల గదికి వెళ్లిన ఆయన కాలుజారి పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే రాజపాళయం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక అతని మెదడు నిర్జీవమైన పరిస్థితుల్లో అతడి తల్లిదండ్రులు వైరముత్తు అవయవాలను ఆసుపత్రి వైద్యాధికారులకు దానం జేశారు. దీనిపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

పెంపుడు శునకాలకు లైసెన్స్ పొందడం ఎలా?

అడయార్, మే 10: చెన్నై మహానగరంలో శునకాలను పెంచుకునేందుకు లైసెన్స్ తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది యజమానులు తమ పెంపుడు జంతువులకు లైసెన్స్ తీసుకునేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు ఈ నేపథ్యంలో ఈ లైసెన్స్ పొందే విధానాన్ని తెలియజేస్తూ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. చెన్నై కార్పొరేషన్ వెబ్‌సైట్ "www.chennaicorporation.gov.in లో ఆన్‌లైన్ సర్వీసెస్ అనే లింకు క్లిక్ చేయాల్సి ఉంటుంది. ఇందులో ‘పెట్ అనిమల్స్ లైసెన్స్’ అనే విండోను క్లిక్ చేసి, న్యూ యూజర్‌ను ఎంపిక చేసి అందులో తమ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మొబైల్ నంబరుకు వచ్చే నాలుగు అంకెల పిన్ నంబరుతో లాగిన్ కావాల్సి ఉంటుంది. అనంతరం న్యూ పెట్ రిజిస్ట్రేషన్ అనే లింకు ఎంపిక చేసి... పెంపుడు శునకాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. శునక యజమాని పేరు, యజమాని ఫొటో, శునకం ఫోటో, ఒక యేడాది కాలంలో ‘ఏఆర్‌వీ’ (ర్యాబిస్) ఇంజెక్షన్ వేసినట్టుగా నిర్ధారించే సర్టిఫికెట్, డిక్లరేషన్ వంటివి పొందుపరచాలి. ఈ వివరాలను సంబంధిత జోన్ పరిధిలోని పశువైద్యుడు పరిశీలించి ఆమోదించిన తర్వాత మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ వస్తుంది. ఈ సందేశం ఆధారంగా కార్పొరేషన్ పోర్టల్‌కు వెళ్ళి రూ.50 చెల్లించి పెట్ అనిమల్ లైసెన్స్ సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఈ లైసెన్సును ప్రతి యేటా పొందాల్సి ఉంటుందని చెన్నై కార్పొరేషన్ శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు

● పలు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

పెరంబూర్, మే 10: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో పలు రాష్ట్రాల్లో దాఖలైన కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి ఉదయనిధి దాఖలుచేసిన పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని పలు రాష్ట్రప్రభుత్వాలకు, ఆయనకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన వారికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. గత ఏడాది సెప్టెంబరులో నగరంలో జరిగిన ఓ మహానాడులో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. మలేరియా, డెంగ్యూ వ్యాధుల వలే, సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలని మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మారాయి. ఉదయనిధి మాటలకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల న్యాయస్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో, ఉదయనిధి సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో, అన్ని రాష్ట్రాల్లో దాఖలైన పిటిషన్లన్నీ ఒకే కేసుగా విచారించాలని కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. ఈ కేసు శుక్రవారం విచారణకు రాగా, ఉదయనిధి పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని పలు రాష్ట్రప్రభుత్వాలకు, ఆయనకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలుచేసిన వారికి నోటీసులు జారీచేసింది. అలాగే, గత విచారణ సమయంలో, సెక్షన్ 32 ప్రకారం ఉదయనిధి పిటిషన్ దాఖలు చేయడంపై ఆక్షేపణ తెలిపిన ధర్మాసనం.. సీఆర్‌పీసీ 406 (కేసుల బదిలీకి సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం) ప్రకారం పిటిషన్ దాఖలుచేయాలని సూచించింది. ఆ ప్రకారం, ఉదయనిధి తరఫున సవరణ పిటిషన్ దాఖలుచేయగా, ధర్మాసనం ఆ పిటిషన్ అంగీకరించింది.

తిరుచెందూర్ హూండీ ఆదాయం రూ.2.49 కోట్లు

పెరంబూర్, మే 10: తిరుచెందూర్ అరుళ్‌మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2.49కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు గత నెలకు సంబంధించిన ఆలయ హుండీల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని కావడి మండపంలో రెండు రోజులపాటు జరిగాయి. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు రూ.2,47,76,188, గోశాల సంరక్షణకు రూ.49,083, ఏనుగు సంరక్షణ హుండీలో రూ.1,19,428 మొత్తం 2.49 కోట్ల నగదు కానుకగా సమర్పించారు. అలాగే, 1,100 గ్రాముల బంగారం, 21 వేల గ్రాముల వెండి, 5,000 గ్రాముల చెంబు, 5,000 గ్రాముల తగరం, 326 విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బస్సును నడిపి తనిఖీ చేసిన కలెక్టర్



ప్రైవేటు పాఠశాల బస్సు నడుపుతున్న కలెక్టర్ శరవణకుమార్

పెరంబూర్, మే 10: రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల బస్సులు, వ్యాన్లను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ రెండో వారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పాఠశాల వాహనాల కండిషన్ పరిశీలించాలని రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాఠశాలల వాహనాల తనిఖీ చేపట్టారు. లోపాలుంటే వాటిని సరిచేసి మళ్లీ తీసుకురావాలని పాఠశాల యజమాన్యాలకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి ఆర్టీఏ కార్యాలయ ప్రాంగణంలో 49 పాఠశాలకు చెందిన 510 వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. దీనిని పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ శరవణకుమార్, ఓ బస్సు నడిపి దానిని పరిశీలించారు.

పుల్లూరు చెక్‌డ్యాంలో అమ్మవారి విగ్రహం



బయల్పడిన అమ్మవారి విగ్రహం

ఐసిఎఫ్, మే 10: తిరుపత్తూర్ జిల్లా పుల్లూరు చెక్‌డ్యాంలో అమ్మవారి విగ్రహం బయల్పడింది. రెండు సంవత్సరాలుగా పూర్తి సామర్థ్యంతో నిండిన ఈ డ్యాంలో వేసవి ప్రభావంతో నీరు అడుగంటింది. ఈ డ్యాంలో గురువారం ఆ ప్రాంతానికి చెందిన కొందరు పిల్లలు ఆడుకుంటున్న సమయంలో మూడడుగుల అమ్మవారి విగ్రహం కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో వారి సమాచారం మేరకు చేరుకున్న రెవెన్యూ శాఖ అధికారులు విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

8 మందికి ఆర్థికసాయం

ఐసిఎఫ్, మే 10: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో 8 మందికి ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ కోసం కరుణానిధి బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.5 కోట్లకు లభించే వడ్డీని ప్రతినెలా పేద విద్యార్థులు, ప్రజలకు అందజేస్తున్నారు. ఆ ప్రకారం, 8 మందికి మే నెల వడ్డీని తలా రూ.25,000 వంతున సీఎం స్టాలిన్ అందజేశారు.

వైకల్యాన్ని అధిగమించి టెన్త్‌లో ఉత్తీర్ణత



తమిళ్ సెల్వన్

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాకు చెందిన ఓ పోలియో బాధిత విద్యార్థి కాళ్లు చేతులూ పనిచేయకపోయినా పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణుడై తన ప్రతిభను ఎలుగెత్తి చాటుకున్నాడు. తిరునల్వేలి జంక్షన్ మీనాక్షిపురం ప్రాంతానికి చెందిన శశికుమార్, పాప్పా దంపతుల రెండో కుమారుడు తమిళ్‌సెల్వన్ చిన్నతనంలో పోలియో బారిన పడ్డాడు. కాళ్లు చేతులు పనిచేయకపోయినా తల్లిదండ్రులు అతడికి అన్ని సపర్యలు చేసి చదివించారు. ఈ నేపథ్యంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు తమిళ్‌సెల్వన్ హాజరయ్యారు. అతడికి ఓ ఉపాధ్యాయుడు సాయపడ్డారు. శుక్రవారం ఉదయం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమిళ్‌సెల్వన్ 500ల మార్కులుగాను 420 మార్కులు సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. దీంతో అతడి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా తమిళ్‌సెల్వన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో తాను లాయర్ కావాలని ఆశపడుతున్నానని, ఆ దిశగానే తాను పై చదువులు చదువుతానని పేర్కొన్నాడు.

కనీస మార్కులతో పాసైన బాలుడికి సత్కారం



మణికంఠన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో తిరువారూరు జిల్లా మన్నార్‌గుడికి చెందిన ఓ బాలుడు అత్యల్ప మార్కులతో పాసయ్యాడు. అంతమాత్రానికే ఆ ఊరి ప్రజలంతా పాసైన విద్యార్థికి ఘన సత్కారం చేశారు. మన్నార్‌గుడి సమీపం వడువూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదివిన మణికంఠన్ అన్ని పాఠ్యాంశాల్లో పాస్‌మార్కులు తెచ్చుకున్నాడు. 500ల మార్కులకుగాను 210 మార్కులతో పాసయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు మణికంఠన్‌ను ఫస్ట్‌క్లాస్‌లో పాసైన విద్యార్థిలా ఘనంగా సత్కరించారు. ఊరివారంతా కలిసి తనను సత్కరించడంతో థర్డ్ క్లాస్‌లో పాసయ్యాననే దిగులుతో ఉన్న మణికంఠన్ పట్టరాని సంతోషంతో ఉబ్బితబ్బిబయ్యాడు.


మంత్రి పొన్ముడికి బెయిలు గడువు పెంపు

● సుప్రీంకోర్టు ఉత్తర్వు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులో హైకోర్టు విధించిన శిక్షపై సుప్రీం కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్న రాష్ట్ర మంత్రి పొన్ముడికి బెయిలు పొందటానికి రెండు వారాల గడువు లభించింది. 2006-2011 సంవత్సరాల్లో డీఎంకే ప్రభుత్వ హయంలో ఖనిజ వనరుల శాఖ మంత్రిగా పనిచేసిన పొన్ముడి ఆదాయానికి మించి రూ.1.75 కోట్ల మేర అక్రమ ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై నమోదైన కేసులో హైకోర్టు ఆయనకు, భార్య విశాలాక్షికి మూడేళ్ల జైలు విధించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ పొన్ముడి సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకున్నారు. సుప్రీం కోర్టు విచారణ జరిపిన హైకోర్టు విధించిన శిక్షలపై స్టే విధించింది. అదే సమయంలో దిగువ కోర్టులో లొంగిపోవటానికి బదులు బెయిలు పొందవచ్చునని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బెయిలు పొందాటానికి మరింత గడువు కోరుతూ పొన్ముడి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీం కోర్టు పొన్ముడి బెయిలు పొందటానికి రెండు వారాల గడువునిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

సర్కారీ కొలువు పేరిట రూ.12 కోట్ల మోసం!

వ్యాపారి కిడ్నాప్, హత్య ● ఊత్తాంగరైలో శవాన్ని పాతిపెట్టిన ముగ్గురి అరెస్టు



వెంకటేశన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, మే 10: ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.12 కోట్ల మేరకు మోసం చేసిన టెంకాయల వ్యాపారిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని కృష్ణగిరి జిల్లా ఊత్తాంగరై సమీపంలో పాతిపెట్టారు. ఈ కిడ్నాప్, హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... మొగప్పేర్‌కు చెందిన వెంకటేశన్ (54) వాహనాల తయారీ కంపెనీలో పనిచేసేవాడు. జీతం చాలకపోవడంతో ఉద్యోగానికి రాజీనామా చేసి, సొంతంగా టెంకాయల వ్యాపారం ప్రారంభించాడు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. ఈ నెల 5వ తేదీ తన కుమారుడిని కుండ్రత్తూరులో నీట్ పరీక్షా సెంటరులో వదిలిన ఈ దంపతులు.. కారులో సేలం వరకు వెళ్లారు. ఆ తర్వాత వీరిద్దరూ ఇంటికి రాలేదు. మొబైల్ ఫోన్స్ కూడా స్విచాఫ్ అయ్యాయి. దీంతో వారి కుమారులు కుండ్రత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వేలు సారథ్యంలో ప్రత్యేక పోలీస్ బృందం వెంకటేశన్ దంపతుల ఆచూకీ కోసం గాలించింది. కుమారులిచ్చిన సమాచారం మేరకు.. ఊత్తాంగరై సమీపంలోని సున్నలంపట్టికి చెందిన గణేశన్ అనే ఉపాధ్యాయుడు, వెంకటేశ్ మధ్య నగదు లావాదేవీలు జరుగుతుండేవని, వారిద్దరి మధ్య గొడవలు కూడా జరిగినట్టు చెప్పారు. ఈ సమాచారంతో గణేశన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అతడి అనుచరులు నిత్యానందం తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఈ ముగ్గురిని విచారించగా పలు విషయాలు వెలుగు చూశాయి. టెంకాయల వ్యాపారి వెంకటేశన్ తనకు తాను మంచి పలుకుబడివున్న వ్యక్తిగా నమ్మించి, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనేక మంది వద్ద డబ్బులు వసూలు చేసినట్టు వారు వెల్లడించారు. టీచర్ గణేశన్ దగ్గర కూడా ఇదే విధంగా ప్రభుత్వ ఉద్యోగం పేరుతో రూ.12 కోట్ల వరకు వసూలు చేసినట్టు వారు చెప్పారు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని పలుమార్లు కోరినా ఇవ్వకపోవడంతో, అతడిని ఊత్తీవటరై పిలిపించి, ఆస్తులు తమ పేరిట రాయించుకోవాలని భావించారు. తమ ప్లాన్‌లో భాగంగా వెంకటేశన్ దంపతులను ఊత్తాంగరైకు రప్పించి, అక్కడి నుంచి కిడ్నాప్ చేసి, గణేశన్‌కు చెందిన తోటలో భార్యాభర్తలను వేర్వేరు గదుల్లో బంధించారు. ఈ క్రమంలో తమ డబ్బులు తిరిగి చెల్లించాలని లేదా ఆస్తులు తమ పేరిట రాయాలని గణేశన్ ఆయన అనుచరులు కొట్టడంతో వెంకటేశన్ మరణించాడు. దీంతో తోటలోనే గొయ్యి తీసి వెంకటేశన్ మృతదేహాన్ని పాతిపెట్టారు. భర్త చనిపోయిన విషయాన్ని భార్య లక్ష్మికి చెప్పకుండా, ఆస్తులు తమ పేరిట రాయాలని ఒత్తిడి చేశారు. ఈ వేధింపులను భరించలేని లక్ష్మి... ఆస్తులు రాయాలంటే తమ కుమారులు సంతకాలు చేయాల్సి ఉంటుందని చెప్పడంతో వారిద్దరిని ఊత్తాంగరైకు పిలిపించారు. ఆ ఇద్దరు పిల్లల వెంట పోలీసులు వెళ్ళి గణేశన్ ముఠాను అరెస్టు చేశారు. ఈ కిడ్నాప్, హత్యకు సంబంధించి మరో 12 మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఏనుగుల మార్గాల కోసం గిరిజన ఆవాసాలు తొలగిస్తారా...?

● ఈపీఎస్ ధ్వజం

ప్యారీస్, మే 10: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో, ఏనుగుల మార్గాల కోసం గిరిజన ఆవాసాలు తొలగించడం న్యాయమేనా అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్రప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ప్రభుత్వ నియంత్రణలోని అటవీ శాఖ ఏనుగుల మార్గాల కోసం రూపొందించిన మ్యాప్‌తో కూడిన నివేదిక విడుదలైందని, దీనిని పరిశీలించి తాను దిగ్భ్రాంతికి గురైనట్లు ఈపీఎస్ తెలిపారు. అటవీ శాఖ చర్యల వల్ల రాష్ట్రంలో అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులు తమ నివాస ప్రాంతాలను కోల్పోయే ప్రమాదముందని, ముఖ్యంగా నీలగిరి జిల్లా గూడలూరులో నివసిస్తున్న వేలాది మంది గిరిజన కుటుంబాలు ఆశ్రయం కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2000 సంవత్సరంలో నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో 25 ఏనుగుల మార్గాలున్నట్లు గుర్తించారని, 2017లో చేపట్టిన మరో సర్వేలో ఆ సంఖ్య 18గా ఉండేదన్నారు. తర్వాత 2023లో జరిపిన సర్వేలో 20 ఏనుగుల మార్గాలున్నట్లు గుర్తించారని, వాటిలో 15 రాష్ట్రంలోను, మిగతా 5 కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నట్లు స్పష్టమైందన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో జరిపిన మూడు సర్వేల్లో ఏనుగు మార్గాల గురించి సరైన వివరణ లేదని, ఇప్పటి వరకు అటవీ శాఖ జరిపిన సర్వేలు ఎన్ని, వాటిలో ఏనుగు మార్గాలు ఎన్ని అన్న దానిపై సమగ్రమైన నివేదిక తయారుచేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

56 ఇంజనీరింగ్ కళాశాల్లో ఉత్తీర్ణత 20 శాతం లోపే...!

● రెండు కళాశాలల్లో 0 ఉత్తీర్ణత

పెరంబూర్, మే 10: అన్నా విశ్వవిద్యాలయ పరిధిలోని 56 ఇంజనీరింగ్ కళాశాలల్లో 20 శాతం కంటే తక్కువగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రెండు కళాశాలలో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణుడు కాలేదు. అన్నా వర్సిటీ పరిధిలో 400 ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలో 300 కళాశాలలు స్వయం ప్రతిపత్తివి కలిగినవి కాగా, అన్నా వర్సిటీ పరీక్ష శాఖ ద్వారానే సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలల్లో గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించగా, ఉత్తీర్ణతా శాతాన్ని రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ కమిటీ గురువారం విడుదల చేసింది. ఆ ప్రకారం, రెండు కళాశాలల్లో 90 శాతానికి పైగా విద్యార్థులు సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఆరు కళాశాలల్లో 80 నుంచి 90 శాతం, 46 కళాశాలల్లో 60 నుంచి 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక, 101 కళాశాలల్లో 40 శాతం నుంచి 60 శాతం వరకు, 97 కళాశాలల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు, 32 కళాశాలల్లో 10 శాతం నుంచి 20 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 24 కళాశాలల్లో ఒక్క శాతం నుంచి 10 శాతంలోపు మాత్రమే ఉత్తీర్ణత ఉండగా, రెండు కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదు. వచ్చే విద్యా సంవత్సరం ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆయా కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత గురించి అడ్మిషన్లు పొందనున్న విద్యార్థులు తెలుసుకొనేలా ఈ జాబితా విడుదల చేశారు. విద్యార్థులు www.tneaonline.org/ అనే వెబ్‌సైట్‌లో కళాశాలల ఉత్తీర్ణత వివరాలు తెలుసుకోవచ్చు.

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



విరుదంబట్టులో ఏర్పాటైన చలివేంద్రం

వేలూరు, మే 10: విరుదంబట్టులో వేసవి ఎండల్లో ప్రజల దాహార్తి తీర్చేలా డీఎంకే తరఫున చలివేంద్రం ఏర్పాటుచేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కౌన్సిలర్ నిత్య అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డీఎంకే శాఖా సెక్రటరీ పరమశివం పాల్గొని చలివేంద్రం ప్రారంభించారు.

ఐస్ వ్యాపారి దారుణ హత్య

వేలూరు, మే 10: రాణిపేట జిల్లా బాలాపురం గ్రామానికి చెందిన నారాయణమూర్తి చుట్టుపక్కల గ్రామాల్లో సైకిల్‌పై తిరుగుతూ ఐస్ విక్రయిస్తుంటాడు. అతను గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది.ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం టాస్మాక్ మద్యం దుకాణం సమీపంలో నారాయణమూర్తి శవమై పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు సిప్కాట్ పోలీసులకు సమాచారమిచ్చారు.పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.మృతదేహం గొంతు, ఛాతి భాగాల్లో కత్తి పోట్లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, ఆ దిశగా విచారణ చేపట్టారు.

బైక్‌ను లారీ ఢీకొని విద్యార్థి మృతి

ప్యారీస్, మే 10: స్థానిక మధురవాయల్‌లో పదవ తరగతి విద్యార్థి నడిపిన బైక్‌ను లారీ ఢీకొనడంతో విద్యార్థి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మధురవాయల్ ధనలక్ష్మినగర్‌కు చెందిన జీవ (15) ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్నాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు టిఫిన్ కోసం మధురవాయల్ ఫ్లై ఓవర్ సమీపంలో బైక్‌లో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఉదయం 9.30 గంటలకు టెన్త్ ఫలితాలు వెల్లడయ్యేందుకు గంట ముందు జీవ ప్రమాదంలో మృతిచెందడంపై ఆయన కుటుంబసభ్యులు, సహ విద్యార్థులు బోరున విలపించారు.

కోళ్ల ఫారంలో అగ్నిప్రమాదం

● రూ.12 లక్షల ఆస్తి నష్టం



కోళ్ల ఫాంలో చెలరేగిన మంటలు

వేలూరు, మే 10: జిల్లాలోని లత్తేరి సమీపం మాలియపట్టు గ్రామానికి చెందిన దినకరన్ తనకున్న ఎకరా స్థలంలో కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఫాంలో 6,200 కోడిపిల్లలున్నాయి. ఈ నేపథ్యంలో, గురువారం రాత్రి హఠాత్తుగా మంటలు చెలరేగడాన్ని గుర్తించిన దినకరన్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకొనేలోపే ఫారం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారని, ఫాం సమీపంలో కిరోసిన్ క్యాన్ కూడా ఉందనే బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

పిడుగుపాటుకు ధ్వంసమైన గోపుర శిల్పం

ఐసిఎఫ్, మే 10: తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం పర్వతమలైలో ఉన్న మల్లికార్జునేశ్వర ఆలయ గోపురం ఉన్న శిల్పం పిడుగుపాటుకు ధ్వంసమైంది. కలశపాక్కం సమీపంలోని తెన్ మహాదేవమంగళంలోని 4,560 అడుగుల పర్వతాల గిరిపై భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఆలయ ప్రాంగణంలో మూడు పిడుగు నిరోధకాలు ఉన్నప్పటికీ, వాటిలో రెండు ఇటీవల మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. హఠాత్తుగా పడిన పిడుగుపాటుకు గోపురంపై ఉన్న కావలిదైవం విగ్రహం ధ్వంసం కావడంతో పాటు ఆలయ ప్రాకారం బీటలు వారింది. 2010లో ఈ ఆలయంలో పిడుగుపాటుకు నలుగురు మృతిచెందారు.

కిరాణా షాపుల్లో 13 కేజీల గంజాయి స్వాధీనం

అడయార్, మే 10: నగర శివారు ప్రాంతమైన మనలి సహా పరిసర ప్రాంతాల్లోని అనేక కిరాణా షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతాల్లోని కిరాణా షాపుల్లో జోరుగా మత్తు పదార్థాలతో పాటు గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు రెడ్‌హిల్స్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సమాచారం వచ్చింది. దీంతో ప్రత్యేక పోలీసుల బృందం ఆయా ప్రాంతాల్లో కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 13 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పలువురు వ్యాపారులపై కేసు నమోదు చేశారు.



ఆంధ్ర రాష్ట్రం తిరుపతి శాసనసభ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆరణి శ్రీనివాసులుకు మద్దతుగా తిరుపతిలో ప్రచారం చేస్తున్న వేలూరు జిల్లా నాయుడు సంఘం అధ్యక్షుడు మురళీధరన్

చిత్రజ్యోతి


'అరణ్మనై-4'లో ఓ దృశ్యం

'అరణ్మనై-4'కి వసూళ్ళ వర్షం


ఈ నెల 3వ తేదీ విడుదలైన 'అరణ్మనై-4' చిత్రం వసూళ్ళ వర్షం కురిపిస్తుంది. సుందర్ సి హీరోగా నటించి, దర్శకత్వం వహించారు. రాశీఖన్నా, తమన్నా హీరోయిన్లుగా నటించగా, సినీ నటి ఖుష్బూ సొంతంగా నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటివరకు దాదాపు రూ.50 కోట్ల మేర వసూలు చేసినట్టు కోలీవుడ్ ట్రేడ్ వర్గాల సమాచారం. ఇందులో స్టార్ హీరోలు ఎవరూ నటించకపోయినప్పటికీ స్టోరీ, పాటలు, హాస్యం, సెంటిమెంట్ ఇలా అన్ని అంశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ కావడంతో హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. దీంతో నిర్మాతతో పాటు పంపిణీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఈ యేడాది ఇప్పటివరకు 80కుపైగా చిత్రాలు విడుదలకాగా, వీటిలో ఒక్క చిత్రం కూడా వాణిజ్య పరంగా హిట్ సాధించలేకపోయింది. కానీ, అరణ్మనై-4 మాత్రం ఆ లోటు తీర్చి వసూళ్ళ వర్షం కురిపిస్తోంది.

'ఇండియన్-2' ఆగస్టుకు వాయిదా?

ఎస్.శంకర్ దర్శకత్వంలో కమల్ హీరోగా నటిస్తున్న 'ఇండియన్-2' చిత్రం రిలీజ్ మరోమారు వాయిదా పడినట్టు వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం మేరకు ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. గతంలో వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్‌లో 'ఇండియన్-2' విడుదల చేస్తారని ప్రతి ఒక్కరూ భావించారు. కానీ, ఈ సినిమా జూన్‌లో విడుదల చేసే అవకాశమే లేదని కోడంబాక్కం వర్గాల సమాచారం. ఈ సినిమా క్లైమాక్స్‌లో గ్రాఫిక్ వర్క్స్ అధికంగా ఉండటంతో మరికొంత సమయం కావాల్సి రావడంతో చిత్రాన్ని ఆగస్టు నెలలో విడుదల చేయాలని భావిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్, లైకా ప్రొడక్షన్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా తెరకెక్కించే ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, ప్రియా భవానీ శంకర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.


'ఇండియన్-2'లో ఓ దృశ్యం

జూన్ 13న 'రాయన్'గా వస్తున్న ధనుష్



'తిరుచిత్రాంబలం', 'వాత్తి', 'కెప్టెన్ మిల్లర్' వంటి వరుసగా విజయవంతమైన చిత్రాల్లో నటిస్తున్న హీరో ధనుష్ జూన్ 13వ తేదీ 'రాయన్'గా ప్రేక్షకుల ముందుకురానున్నారు. ఇది ఆయన నటించే 50వ సినిమా కావడం గమనార్హం. హీరోగా నటిస్తూనే దర్శకత్వం కూడా వహించారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చుతున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, ప్రకాష్ రాజ్, సెల్వరాఘవన్, తుషార విజయన్, అపర్ణ బాలమురళి, వరలక్ష్మి తదితరులు నటించారు. గురువారం ఈ సినిమాలోని తొలి సింగిల్ సాంగ్ రిలీజ్ చేశారు. పనిలోపనిగా మూవీ విడుదల తేదీ కూడా అధికారికంగా వెల్లడించారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమా కథాంశం ఏంటన్నది సస్పెన్స్‌గా ఉంది. దీంతో ప్రేక్షకుల్లో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

విద్యార్థి చిన్నదురైకి పా.రంజిత్ అభినందన

ఇటీవల విడుదలైన ప్లస్‌టూ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన చిన్నదురై అనే విద్యార్థిని సినీ దర్శకుడు పా.రంజిత్ ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత చదువులకు అవసరమైన సాయం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గత యేడాది ఆగస్టులో తిరునెల్వేలి జిల్లా నాంగునేరిలో ప్లస్‌టూ చదువుకునే చిన్నదురైని సహ విద్యార్థులే కులవివక్ష చూపి కత్తితో దాడి చేశారు. ఈ దాడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ దాడి తర్వాత కూడా చిన్నదురై ఏమాత్రం మనోస్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో చదివి 469 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా చిన్నదురైని ఇటీవల సచివాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించిన విషయం తెల్సిందే. అలాగే సినీ దర్శకుడు పా.రంజిత్ కూడా చిన్నదురైని అభినందించి, తమ నీలం ప్రొడక్షన్స్ ద్వారా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.


చిన్నదురైని అభినందిస్తున్న పా.రంజిత్

ఊటీలో విరిసిన అందాలు

- పుష్ప ప్రదర్శన ప్రారంభం
- పోటెత్తిన సందర్శకులు


పూల అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు




బొటానికల్ గార్డెన్ ప్రవేశద్వారం వద్ద పర్యాటకులు

ప్యారీస్, మే 10: పచ్చదనం నిండిన కొండలు...పరవశింపజేసే గాలులు... పారే జలపాతాలు...ఎటుచూసినా ప్రకృతి అందాలను సంతరించుకొని 'క్వీన్ ఆఫ్ ఇండియన్ హిల్‌స్టేషన్'గా ప్రసిద్ధిచెందిన ఊటీ 126వ పుష్ప ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 20వ తేది వరకు 10 రోజులు సువాసనలు వెదజల్లిస్తూ జరిగే ప్రదర్శనకు స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన సందర్శించేందుకు రూ.75, పెద్దలకు రూ.150ల రుసుము నిర్ణయించారు. సందర్శకులను ఆకట్టుకొనేలా సుమారు లక్ష పూలతో డిస్నీ వరల్డ్ నమూనాను కళాకారులు రూపొందించారు. అలాగే, రకరకాల పూలతో బ్రిటీష్ పాలకులు 1908లో పరిచయం చేసిన కొండ రైలు నమూనా



అందర్నీ ఆకట్టుకుంటోంది. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం నుంచి ఊటీ బయల్దేరే ఈ రైలు 7,200 అడుగుల ఎత్తున ప్రయాణం చేస్తోంది. ఈ బుల్లి రైలులో ప్రయాణిస్తూ ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు రెండు నెలల ముందుగానే పర్యాటకులు టిక్కెట్లు రిజర్వ్ చేసుకుంటుంటారు. సుమారు 62,000 పూలతో 33 అడుగుల ఎత్తులో కొండ రైలు నమూనా చూడముచ్చటగా డిజైన్ చేసి ప్రదర్శనలో ఉంచారు. కాగా, 1825లో ఊటీ నడిబొడ్డున ఆంగ్లేయ ఇంజనీర్లు నిర్మించిన చెరువులో బోట్ సఫారీ కోసం పర్యాటకులు పెద్దసంఖ్యలో క్యూ కట్టారు. ప్రదర్శనలో పలురకాల పుష్పాలతో ఏర్పాటుచేసిన మే ఫ్లవర్ షో విశేషాదరణ పొందుతోంది. శుక్రవారం ఉదయం ప్రారంభించిన ప్రదర్శనలో పూలమొక్కలు, పుష్పాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఉద్యానవన, పర్యాటక శాఖ అధికారులు పుష్ప ప్రదర్శన విశేషాలను సందర్శకులకు వివరిస్తున్నారు. విదేశీ రకానికి చెందిన ఫ్రెంచ్ మేరీగోల్డ్, ఇస్కా మేరీగోల్డ్, ఫ్లాస్ బెల్డానియా, ఫ్యాన్సీ బికోనియా, బెంగోనియా, బేలియా, విలియం, సూర్యకాంతి తదితర 60,000లకు పైగా మొక్కలను మూడు నెలల క్రితమే ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో నాటించి, వాటిని సంరక్షించారు. కార్నేశన్ మొక్కలతో భవనాల నమూనాలు, మిక్కీమౌస్, మంకీ ఆకారాలు విశేషంగా చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. బొటానికల్ గార్డెన్ ప్రవేశ మార్గంలో పలు రంగుల పుష్పాలతో తోరణాలు, స్వాగత బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖలకు చెందిన స్టాల్స్ కూడా ఈ ప్రదర్శనలో ఏర్పాటయ్యాయి. ఈ సారి ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో ఊటీకి వెళ్లే సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది.


పూలతో రూపొందించిన మిక్కీమౌస్


ఆకట్టుకుంటున్న విదేశీ పూలు


ప్రదర్శనలో పూలతో డిజైన్ చేసిన నమూనా


పూల ప్రదర్శనలో సందర్శకుల తాకిడి


సీతాకోకచిలుక నమూనా

రేపటి నుంచి 'సమ్మర్ కార్నివాల్'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్

ప్యారీస్, మే 10: స్థానిక ఈసీఆర్ రోడ్డు అక్కరైలో ఈ నెల 12 నుంచి జూన్ 24వ తేదీ వరకు సమ్మర్ కార్నివాల్-2024 నిర్వహించనున్నారు. మూడు మెగా ఈవెంట్లతో కూడిన ఈ కార్నివాల్ విశేషాలను ఫ్రెంచ్ విలేజ్ ఫుడ్ స్ట్రీట్ నిర్వాహకులు విక్రాంత్ చెన్నై ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరించారు. నేషనల్ మల్టీ టాలెంట్ కాంటెస్ట్‌లో కళలు, కథలు, రచన, ప్రసంగం, సంగీతం, గానం, నృత్యం, ఫొటోగ్రఫీ, లఘుచిత్రం, వ్యక్తిగత పోటీలుంటాయని తెలిపారు. ప్రదర్శన ప్రాంగణంలో మల్టీ కుషన్ బ్రాండెడ్ వెజ్, నాన్ వెజ్ ఫుడ్ కోర్ట్, గేమ్ షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్నివాల్‌లో పాల్గొనే సందర్శకులకు వాహనాల పార్కింగ్, వైద్యం తదితర వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు.

షోలింగనల్లూర్‌లో స్పిన్నీ పార్కింగ్ హబ్

ప్యారీస్, మే 10: ఉపయోగించిన కార్ల కొనుగోలు, టెస్ట్ డ్రైవ్, పార్కింగ్ కోసం షోలింగనల్లూర్‌లో బ్రహ్మాండమైన స్పిన్నీ పార్కింగ్ హబ్ ఏర్పాటైంది. స్పిన్నీ వ్యవస్థాపకుడు నీరజ్‌సింగ్, హెడ్ శరవణన్ రాధాకృష్ణన్ ఈ హబ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఓఎంఆర్ రోడ్డులోని షోలింగనల్లూర్ వాహన వినియోగదారుల కోసం ఏర్పాటుచేసిన ఈ హబ్‌లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం నగరంలో వ్యాపారం ప్రారంభించి 20,000 కార్ల పార్కింగ్ సామర్థ్యంతో సేలం, మదురై, తిరుచ్చి నగరాల్లో ఐదు హబ్‌లు ఏర్పాటుచేసినట్లు వివరించారు.


వాహనాల పార్కింగ్ హబ్

అక్షయ తృతీయ ఎఫెక్ట్

- నగల దుకాణాలకు పోటెత్తిన మహిళలు


ఓ దుకాణంలో నగలు కొంటున్న మహిళలు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా నగరంలోని ప్రముఖ నగల దుకాణాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి. అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే ఇంట మహాలక్ష్మి శాశ్వతంగా తిష్టవేస్తుందనే నమ్మకం ఇటీవల కాలంలో అధికం కావటంతో మహిళలు పోటీపడి నగలు కొనటం అలవాటుగా మారింది. అక్షయ తృతీయ శుక్రవారం రోజునే రావటంతో మహిళలు నగరంలోని నగల దుకాణాలకు ఉదయమే వెళ్ళారు. టి.నగర్, ప్యారీస్ కార్నర్, క్రోంపేట, పురుషవాక్కం, పాడి, అన్నానగర్, తాంబరం తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ నగల దుకాణాల్లో ఉదయం ఆరుగంటలకే మహిళలు నగల కొనడానికి బారులు దీరారు. అక్షయ తృతీయ ప్రారంభమైన సమయంలోనే రెండు సార్లు పసిడి ధర పెరిగింది. అక్షయ తృతీయను పురస్కరించుకుని కొన్ని నగల దుకాణాలు రాయితీ కూడా ప్రకటించాయి. ఎనిమిది గ్రాముల నగలు కొంటే రూ.2వేలు తగ్గించి విక్రయిస్తామని, ఇక వజ్రాలకు కేరట్‌కు రూ.15 వేల వరకు తగ్గింపు కూడా ప్రకటించాయి. కేజీ వెండి ఆభరణాలకు రూ.3వేల దాకా ధర తగ్గిస్తామంటూ మరికొన్ని దుకాణాలు ప్రకటించాయి. కొన్ని షాపుల యజమానులు లక్షలాది రూపాయల విలువైన నగలు కొన్న కస్టమర్లను తమ వాహనాలలో సురక్షితంగా ఇళ్ళకు చేర్చే సదుపాయం కూడా కల్పించాయి. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, పెద్ద నగల దుకాణాలు సుమారు 45 వేలకు పైగా ఉండగా నగరంలో ఐదు వేల నగల దుకాణాలున్నాయి. నగల దుకాణాలు అధికంగా ఉన్న ప్యారీస్ కార్నర్, టి.నగర్, పురుషవాక్కం ప్రాంతాలలో కస్టమర్లు వందల సంఖ్యలో వాహనాలలో రావటంతో ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడింది ప్రముఖ నగల దుకాణాలన్నీ అక్షయ తృతీయ రాయితీలు ఆదివారం వరకూ ప్రకటించాయి. ప్యారీస్ కార్నర్ ఎన్ఎస్సీ బోస్‌రోడ్డు, మింట్ స్ట్రీట్, ఎడపాళయం తదితర ప్రాంతాల్లో ఉన్న జ్యువెలరీషాపులు కూడా అక్షయ తృతీయ నగల కొనుగోలుకు వచ్చిన కస్టమర్లతో కిటకిటలాడాయి.


ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్ట బ్రహ్మన జయంతి సందర్భంగా గిండిలోని గాంధీ మండపంలో వున్న ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు

ఎనిమిది నెలల్లో 280 మంది అవయవదానం

- మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, మే 10: రాష్ట్రంలో 2023 నుంచి ఇప్పటి వరకు 208 మంది అవయవదానం చేయగా, వారికి ప్రభుత్వ మర్యాదలతో నివాళులర్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. షోలింగనల్లూర్‌లో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అవయవదానం చేసే వారికి ప్రభుత్వ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తామని 2023 సెప్టెంబరు 23వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారన్నారు. సీఎం ప్రకటించిన అనంతరం అవయవదానం చేసే వారి సంఖ్య పెరిగిందన్నారు. 2023వ సంవత్సరంలో 178 మంది నుంచి 1,000 అవయవాలు పొంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాణాపాయంలో ఉన్న వారికి అమర్చినట్లు తెలిపారు. 2020 నుంచి దేశంలోనే అవయవదానం, అవయవాల మార్పిడి శస్త్రచికిత్సల్లో రాష్ట్రం ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో 2023 నుంచి ఇప్పటివరకు 280 మంది అవయవదానం చేసి 1,595 మందికి ప్రాణదానం చేశారని అవయవదానం చేసిన 159 మందికి ప్రభుత్వం తరఫున నివాళులర్పించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఆ ప్రకటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానం పాటిస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది 130 రోజుల్లో 102 మంది బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి అవయవాలు దానంగా పొందామన్నారు. గత ఏడాదిలో 178 మంది బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి అవయవాలు పొందామన్నారు. ప్రస్తుతం అవయవాలు దానం చేసేందుకు మృతుల కుటుంబ సభ్యుల్లో అవగాహన పెరిగిందని మంత్రి తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

జన కేతనం

www.andhrajyothy.com

శనివారం 11 మే 2024



నిజాయితీ ఓటర్లకు నీరాజనాలు

ఓటు కోసం ఎవరెంతిస్తారా అని ఎదురుచూస్తున్న రోజుల్లో తాము అమ్ముడుపోయేదే లేదంటూ కొందరు ముందుకు రావడం ఆశ్చర్యమే. అందుకేనేమో ఓ పార్టీ నాయకులు వీరి కాళ్లు కడిగి మరీ సన్మానం చేశారు. చంద్రగిరిలోని వైయస్ఎంఆర్ కళ్యాణ మండపం ఈ ఘట్టానికి శుక్రవారం వేదికైంది. ఓటు అమ్ముకునే సంస్కృతికి స్వస్తి చెబుతామంటూ ప్రమాణం చేసినవారిని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచన వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం కాళ్లు కడిగి సత్కరించారు.

- చంద్రగిరి


ఇదీ మందుల



ఇండిపెండెంట్ బిల్డప్...

సత్యవేడు నియోజకవర్గంలో ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి హంగామా చూసి ఓటర్లు విస్తుపోతున్నారు. విశాఖపట్నానికి చెందిన ఈ ఎన్ఆర్ఐ ప్రధాన పార్టీ అభ్యర్థి తరహాలో బిల్డప్ ఇస్తుండటంలో అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. పది మంది బౌన్సర్లు ఈయన్ను అనుసరిస్తుంటే ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ముందుగా జన సమీకరణ ఏర్పాట్లు చేయించుకుని మరీ ప్రచారంలో పాల్గొంటున్నారు. అక్కడితో ఆగకుండా తనకు గజమాలలు వేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలోని అసమ్మతి నేతలను వెంట బెట్టుకుని చేస్తున్న ప్రచారానికి భారీగానే ఖర్చు పెడుతున్నట్లు సమాచారం.

- సత్యవేడు



ముక్కుపుడకా వద్దు బాబోయ్..

శ్రీకాళహస్తిలో ఈసారి ముక్కుపుడక పార్ములా పనిచేసేలా లేదు. గత ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు వైసీపీ నాయకులు ముక్కుపుడకలు పంపిణీ చేశారు. ఇవి పూర్తిగా బంగారంతో తయారుచేసినవని అందరూ నమ్మేశారు. ఆ ఎన్నికల్లో మహిళల ఓట్ల గేలానికి ఇది బాగానే వర్కువుట్ అయింది. ఎన్నికలయ్యాక కొంతమంది ఆ ముక్కుపుడకను మార్చుకుందామని బంగారు షాపులకు వెళ్లి భంగపడ్డారు. ఇది బంగారం కాదు..నాశిరకం బంగారం పూత అని తెలియడంతో అవాక్కయ్యారు. చేసేదిలేక ముక్కున వేలేసుకుని వెనక్కు వచ్చేశారు. గతంలో విజయాన్ని అందించిన ముక్కుపుడక తాయిలాన్ని ఈసారి కూడా పంపిణీ చేసేందుకు సదరు నాయకులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆనోటా ఈనోటా విషయాన్ని తెలుసుకున్న మహిళలు ముక్కుపుడకలంటే ముఖం చిట్లిస్తున్నారు. మరోసారి మోసపోయేదిలేదని వీరంతా చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

- రేణిగుంట



ఏ మచ్చా.... ఎంతిస్తున్నారు...

రే మచ్చా... ఎంతిస్తున్నార్రా... ఇంతవరకు ఎంతిస్తున్నారో ఎవరూ చెప్పడంలేదురా అని ఒకరంటే.. ఇంకా ఒక రోజు ఉందికదా మచ్చా.. ఇస్తార్లే...... ఏ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉండాయో రాస్తా ఉండాది.. ఈ సంభాషణ ఏ ఇద్దరి మధ్యో జరిగింది కాదు... సూళ్లూరుపేట నియోజకవర్గంలో గ్రామాల్లో ఓటర్లలో విస్తృతంగా జరుగుతున్న చర్చ. పోలింగ్ దగ్గర పడుతుండటంతో ఎవరని కదిపినా డబ్బులు ఎప్పుడు ఇస్తారంటూ మాట్లాడుకుంటున్నారు. ఫలానా చోట వెయ్యిరూపాయలిస్తున్నారంట..రెండు వేలిస్తున్నారంట లాంటి అట కబుర్లే వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సమయంలో ఉద్యోగులకు కూడా పార్టీలు డబ్బులిచ్చాయని చర్చించుకుంటున్నారు. ఉద్యోగులకిచ్చినట్టయినా తమకు ఇవ్వకపోరా అనుకుంటున్నారు.

- తడ

● నోట్ దిస్ పాయింట్

అభ్యర్థి నేర చరిత్ర తెలుసుకోండి

అభ్యర్థి ఎలాంటివాడో ఓటర్లకు తెలియాలి. నిజమే.. మరి ఎలా తెలుస్తుంది. తాను చాలా సచ్ఛీలుడిననే అందరూ చెబుతారు. అందుకే ఈ విషయంలో ఎన్నికల కమిషనే చొరవ తీసుకుంది. అభ్యర్థి మీద నమోదయిన కేసుల వివరాలన్నీ తెలియజేయాలని గట్టి నిబంధన విధించింది. కేసుల వివరాలు దాస్తే అనర్హత వేటు పడుతుందని స్పష్టం చేసింది. పోలింగుకు రెండు రోజులు ముందుగా కనీసం మూడుసార్లు దినపత్రికల్లో కేసుల వివరాన్నీ ప్రచురించాలని ఆదేశించింది. దీనివల్ల ఓటర్లకు అభ్యర్థుల నేరచరిత్ర తెలిసే అవకాశం ఉంటుందనేది ఎన్నికల కమిషన్ ఉద్దేశం. ప్రస్తుత ఎన్నికలను పరిశీలిస్తే జిల్లాలో ఇద్దరు ఎంపీ, 18మంది అసెంబ్లీ అభ్యర్థులపై క్రిమినల్ కేసులుఉన్నాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే ఓటర్లందరికీ తమ నేరాల చిట్టా తెలియకూడదని కొందరు అభ్యర్థులు ప్రధాన పత్రికలకు కాకుండా మొక్కుబడిగా సర్క్యులేషన్ అంతగాలేని దినపత్రికల్లో ప్రకటనగా ఇస్తున్నారని సమాచారం.

- తిరుపతి(కలెక్టరేట్)


ఈసారి ఎన్నికలు బహిష్కరిస్తాం...

ఈసారి ఎన్నికలు బహిష్కరించాలని తొమ్మిది స్వయం సహాయక సంఘాల సభ్యులు భీష్మించుకున్నారు. సత్యవేడు మండలం మల్లవారిపాళెం వెస్ట్ గ్రామానికి చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు ఈమేరకు తీర్మానించుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వీరంతా కలసి నిర్ణయాన్ని తెలియజేశారు. ఇరుగుళం గ్రామానికి చెందిన సంఘమిత్ర బాషా తాము చెల్లించిన శ్రీనిధి, సీఐఎఫ్ సొమ్ము రూ.6 లక్షలు స్వాహా చేసినట్లు తేలినా ఎలాంటి చర్యలూ తీసుకోనందునే వీరంతా ఇలా నిర్ణయించుకున్నారు. పైగా దుర్వినియోగమైన సొమ్ము చెల్లించాలంటూ తమకే నోటీసులు రావడంతో డ్వాక్రా సంఘాల సభ్యులంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అందుకే ఈసారి ఆరు నూరయినా..నూరు ఆరయినా ఓటేయరాదని తీర్మానించుకున్నారు.

- సత్యవేడు

? మీ కుమారుడికి ఓటెందుకెయ్యాలి

తిరుపతి, ఆంధ్రజ్యోతి



నుదుట బొట్టు.. దైవభక్తి..సెంటిమెంట్లు.. గంభీరమైన ఆహార్యం. నిరంతరం తిరుగుతూ ఒక రైతులా రాజకీయాల్లో శ్రమిస్తారు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. కానుకలతో జనం మనసు గెలుచుకునే వ్యూహాన్ని పదేళ్లుగా అమలు చేస్తున్నారు. వినాయకచవితికి వీధివీధికీ విగ్రహాలు పంచుతారు. దీపావళికి ఇంటింటికీ టపాసులు పంపుతారు. సంక్రాంతికి బ్రాండెడ్ బట్టల సంచులు ఇళ్లకు చేరుస్తారు. గడియారాలు, కుక్కర్లు, క్యాలెండర్లు... ఎన్నికలొచ్చినపుడే గాక ఏడాది పొడవునా ఇలా ఎప్పుడూ ఏదో ఒక కానుక పంపిణీ జరుగుతునే ఉంటుంది. వందల కోట్ల ఖర్చు. ఎక్కడిది ఇంత డబ్బు అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. పట్టించుకోరు. సీఎం జగన్‌కు వీరవిధేయ హనుమంతుడిలా ఉండే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనేక పదవులూ అధిష్టించారు. ఆ అధికారాన్నీ, సాన్నిహిత్యాన్నీ చంద్రగిరి నియోజవర్గం శాశ్వత అభివృద్ధికి చిటికెడైనా వాడుకోలేదనే ఆరోపణలున్నాయి. తిరుపతిలో కలగలిసిపోయినట్టుగా ఉండే ఈ నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేకపోయారు. ఒక్క ప్రతిష్టాత్మక విద్యా, వైద్య సంస్థనూ సాధించలేకపోయారు. వ్యక్తిగత తాయిలాల పంపకంపై పెట్టిన శ్రద్ధ ఆయన అభివృద్ధిమీద వెచ్చించలేదు. జగన్ ఆదేశించారని, తనకు ఏమాత్రం సంబంధం లేని ఒంగోలు నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి, చంద్రగిరి నుంచి తన కుమారుడు మోహిత్‌రెడ్డిని పోటీ చేయిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండీ చేసిందేమిటనే ప్రశ్నకు బలమైన సమాధాన సాక్ష్యాలు లేవు. ఎన్నికలవేళ ఇప్పుడు అవే చర్చగా మారాయి. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఓటెందుకు వేయాలనే ప్రశ్న చంద్రగిరి నియోజకవర్గంలో వినిపిస్తోంది.

పంపకాలు తప్ప పనేం చేశారు చెవిరెడ్డీ?

- ఆప్యాయంగా పలకరిస్తారు .. మెత్తగా అణచేస్తారు
- ఇసుక, గ్రావెల్ తవ్వకాలతో అనుచరుల అక్రమార్జన

చంద్రగిరి ప్రజల చెవిలో చెవిరెడ్డి పూలు



హామీ: చంద్రగిరిలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయిస్తా!
అమలు: టీడీపీ ప్రభుత్వం 2018లో ఏర్పాటు చేసిన 50 పడకల ఆస్పత్రే ఇప్పటికీ కొనసాగుతోంది.
హామీ: చంద్రగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాయం కల్పిస్తా!
అమలు: కనీసం ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు.
హామీ: చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తా!
అమలు: క్రికెట్ స్టేడియం నిర్మించకపోగా, టీడీపీ ప్రభుత్వంలో మొదలైన ఇండోర్ స్టేడియం పనులు కూడా పూర్తి చేయించలేదు.
హామీ: కళ్యాణి డ్యామ్ జలాలతో చంద్రగిరికి, తిరుపతి రూరల్ గ్రామాలకు తాగునీరు అందిస్తా!
అమలు: ప్రతిపాదనలు కూడా తయారు కాలేదు.
హామీ: శేషాచలం అటవీ సరిహద్దుల్లోని పొలాల్లోకి ఏనుగులు రాకుండా కందకాలు, సోలార్ పవర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: కందకాల తవ్వకం గానీ, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు గానీ కాలేదు. ఏనుగుల బెడదతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.
హామీ: ప్రతి గ్రామంలో ప్యూరిఫైడ్ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: తుడా నిధులతో కొన్ని గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయించినా చాలా వరకూ అవి పనిచేయడం లేదు. పైగా టీడీపీ పాలనలోని ఎన్టీయార్ సుజల పథకం కింద ఏర్పాటు చేసిన ప్లాంట్లను మరమ్మతు చేయించకుండా నిర్వీర్యం చేశారు.
హామీ: పాకాల మండలం నేంద్రగుంట-దామలచెరువు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు: విస్తరణ జరగలేదు. కనీసం ఉన్న రోడ్డుకు మరమత్తులు కూడా చేయలేదు.
హామీ: భాకరాపేట నుంచి తలకోన వరకు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు: నెరవేరలేదు.
హామీ: తిరుచానూరు బస్టాండు ఏర్పాటు చేస్తా!
అమలు: ఆ ఊసే లేదు.

పవర్ ఉండీ ప్రగతి శూన్యం

చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డికి అవకాశమున్నా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. వైపీపీ ప్రభుత్వంలో చెవిరెడ్డికి ప్రభుత్వ విప్‌గానూ, తుడా ఛైర్మన్‌గానూ క్యాబినెట్ హోదా వున్న రెండు నామినేటెడ్ పదవులు దక్కాయి. టీటీడీ పాలకమండలిలో ఎక్స్ అఫిషియో సభ్యుడు కూడా అయ్యారు. సీఎం జగన్‌కు అంతరంగిక సన్నిహితుడుగా పేరుపొందారు. అయినా చంద్రగిరి అభివృద్ధి కోసం ఆయన చేసింది ఏమీలేదు. నియోజకవర్గానికి ఒక పరిశ్రమ గానీ, ఉన్నత విద్యా, వైద్య సంస్థలు గానీ తెప్పించుకోలేకపోయారు.

ఆరోపణలు అపారం

- ఎమ్మెల్యే చెవిరెడ్డి అండతో అనుచరులు, కుటుంబీకులు నియోజకవర్గవ్యాప్తంగా భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో భారీ ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారని ఆరోపణలున్నాయి.
- తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో మఠాలకు చెందిన వందలాది ఎకరాలు ఆక్రమించారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.
- హథీరాంజీ మఠానికి చెందిన అత్యంత ఖరీదైన భూములను తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట తమ ఆధీనంలో ఉంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తుమ్మలగుంటలో తొలుత ఓ గ్రామదేవత పేరిట డెయిరీ అంటూ బోర్డు పెట్టారని, ఇటీవల దాన్ని కూడా పీకించేసి భూమిని సొంతం చేసుకున్నట్లు స్థానిక జనం చెప్పుకుంటున్నారు.
- తుడా లేఅవుట్లలో పార్కుల కోసం కేటాయించిన ఖరీదైన స్థలాలను కూడా అనుచరులు కాజేశారనే ఆరోపణలున్నాయి.
- తుమ్మలగుంట చెరువును ఆక్రమించారని, ఆ స్థలాల విలువ వందల కోట్లుంటుందని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సోదరుడు నియోజకవర్గం మొత్తం మీద టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులను గ్రూపుగా చేసి ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాకు రింగ్ లీడర్‌గా వ్యవహరిస్తూ భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ప్రవహించే స్వర్ణముఖి నదిలో ఇసుక కొల్లగొట్టి వందల కోట్లు పోగేసుకున్నారనే ఆరోపణలున్నాయి.
- అనధికార అపార్టుమెంట్లు, అనధికారిక లేఅవుట్ల యజమానుల నుంచి ఎమ్మెల్యే సోదరుడు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.
- శ్రీవారి దర్శనాలను సైతం దుర్వినియోగం చేస్తున్నారని, పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు, ఎన్ఆర్ఐలకు దర్శనాలు చేయించి ప్రయోజనాలు పొందుతుంటారనే ఆరోపణలున్నాయి.

'జగనన్నతోడు'గా అర్హులకేదీ సాయం

చిరు వ్యాపారులకు అండగా నిలవాల్సిన జగనన్నతోడు పథకం అభాసుపాలవుతోంది. పథకం అమలుకు సంబంధించి జగన్ ప్రభుత్వం చెబుతున్నవి కాకిలెక్కలేనని తేలుతోంది. అసలైన అర్హుల్లో కొందరికే లబ్ధి చేకూరుతోందని చిరువర్తకులు మండిపడుతున్నారు. అధికారపార్టీ నాయకులకు నచ్చినవారికే ఈ పథకం వర్తిస్తోందనే విమర్శలున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



అర్జీలిచ్చినా పట్టించుకోలేదు



20 ఏళ్లుగా చెక్కబండిపై పండ్ల వ్యాపారం చేస్తున్నా. ఈ ప్రభుత్వం గుర్తింపుకార్డు అయితే ఇచ్చింది గానీ జగనన్నతోడు డబ్బులు మాత్రం ఇవ్వలేదు. చాలాసార్లు సచివాలయంలో అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారిలో ఇద్దరికో ముగ్గురికో వచ్చింది.


- మంజుల,తిరుపతి

అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నాం



ఎలాంటి షూరిటీ లేకుండా, వడ్డీ లేకుండా రూ.10 వేలు అప్పు ఇస్తున్నారంటే సంతోషించాం. తొమ్మిదేళ్లుగా అప్పు చేసి పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేస్తున్నా. లాభంలో సగాన్ని వడ్డీకి కట్టి మిగిలిన దాంట్లో తింటున్నాం. ఐడీ కార్డులు ఇవ్వలేదు, జగనన్న తోడు ఇవ్వలేదు.

- వీణ,తిరుపతి



మోసం గురూ!

వీధుల్లో, తోపుడు బండ్లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారికి జగనన్న తోడు పథకం ద్వారా అండగా నిలుస్తామంటూ జగన్ ప్రభుత్వం ప్రకటించింది. వారు తీసుకునే రూ.10 వేలు బ్యాంకు రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని పేర్కొంది. ఈ పథకం కింద 16.73 లక్షల మందికి రూ.3,373 కోట్ల రుణాలు ఇప్పించామని గొప్పలు చెప్పుకుంటోంది. జిల్లాలో ఈఏడాది జనవరిలో ఎనిమిదో విడతగా 16,541 మందికి రూ.17.50 కోట్లు, గతంలో రుణాలు తీసుకున్న 30,782 మంది చిరువ్యాపారులకు సుమారు రూ.70.71 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేసినట్లు లెక్కలు చూపుతోంది.



తిరుపతి రోడ్ల ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు

అర్హులు 15 శాతం మాత్రమే

వాస్తవానికి చిరు వ్యాపారుల్లో కొద్దిమందికి మాత్రమే జగనన్న తోడు అందుతోంది. మొక్కుబడిగానే వడ్డీ చెల్లిస్తున్నారని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. తిరుపతి లో ఈ పథకం అమలుపై 'ఆంధ్రజ్యోతి' సర్వే చేస్తే 15 శాతం మంది మాత్రమే తమకు జగనన్నతోడు లభించిందన్నారు. అర్జీలు పెట్టుకుంటునే ఉన్నా తమను పథకంలో చేర్చడంలేదని కొంతమంది అర్హులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి వ్యాపారాలు చేస్తునామంటూ వాపోయారు. అర్హులు కాకపోయినా అధికారపార్టీ వైసీపీ నేతలు సిఫారసు చేసినవారినే లబ్ధిదారులుగా చేర్చారనే ఆరోపణలున్నాయి. అర్హులెవరూ పెద్దగా లబ్ధి పొందకపోయినా ప్రభుత్వం మాత్రం లేనిపోని గణాంకాలతో గొప్పలు చెప్పుకొంటోంది. గుర్తింపుకార్డులు ఇస్తామంటూ వైసీపీ ప్రభుత్వం తమను మోసగించిందని చిరువ్యాపారులు ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

నాలాగ ఎందరో..

● దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన



వైసీపీ పాలనలో దళితులను అడుగడుగునా అణచివేశారని ఏర్పేడు అశోక్‌నగర్‌కు చెందిన దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేసింది. తానెదుర్కొన్న కష్టాన్ని అమె వివరించిందిలా.. కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీగా గెలిచిన సమయంలో ఏర్పేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొందరు మహిళలతో కలసి సంబరాలు చేసుకుంటున్నాం. ఓర్వలేని అప్పటి సీఐ శ్రీహరి అసభ్య పదజాలంతో, కులంపేరుతో దూషించారు. భర్తలేని నిన్ను పట్టుకుని ఈడ్చి తన్నితే దిక్కెవరన్నారు. అవమానం దిగమింగుకుని సీఐపై చర్యలు తీసుకోవాలని చాలాసార్లు రేణిగుంట డీఎస్పీని కలిశాను. ఆయన స్పందించలేదు. గతేడాది మే 15న కోర్టును ఆశ్రయించాను. విచారించిన కోర్టు శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ భవ్య కిషోర్‌ను ఆదేశించింది. ఈక్రమంలో సీఐ శ్రీహరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదయింది. తనలా ఎంతోమంది దళితులను వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అవమానించిందని కృష్ణవేణి పేర్కొంది. మహిళలు సగర్వంగా తలెత్తుకోవాలన్నా, ఉన్నతంగా ఎదగాలన్నా చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. మహిళలు ఏకమై టీడీపీని గెలిపించాలని ఆమె కోరింది.

- ఏర్పేడు